క్లుప్తంగా

బకింగ్‌హామ్ కెనాల్‌లో గుర్తుతెలియని మృతదేహం



తాడేపల్లిరూరల్: నగర పాలక సంస్థ పరిధిలోని బకింగ్‌హామ్ కెనాల్‌లో గుర్తు తెలియని మృతదేహాన్ని తాడేపల్లి పోలీసులు గురువారం వెలికితీశారు. ఎస్ఐ రమేష్ తెలిపిన వివరాల ప్రకారం బకింగ్‌హామ్‌కెనాల్‌లో మహిళ మృతదేహం కొట్టుకు వచ్చినట్లు సమాచారం అందడంతో పశువుల హాస్పిటల్ బ్రిడ్జి వద్దకు వెళ్లి ఆ మృతదేహాన్ని బయటకు తీశామని, ఆ మహిళను గుర్తించేందుకు ఎటువంటి ఆధారాలు లభించలేదని, ఆమె వయస్సు సుమారు 30 సంవత్సరాలు ఉండవచ్చని, ఎత్తు 5 అడుగులు, ఒంటిపై చుడీదార్, కింద ఫ్యాంట్ కలర్ బ్లూ కలర్‌పై ఎరుపు, తెలుపు పూలు ఉన్నాయని, పై కోటు గులాబీ రంగు కలిగి ఉందని, ఆ మహిళను ఎవరైనా గుర్తిస్తే తాడేపల్లి పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి



ఫిరంగిపురం: ప్రతి ఒక్కరూ తమ ఇంటి చుట్టుప్రక్కల ఉన్న పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని వైద్యురాలు శాంతి అన్నారు. మండలంలోని వేములూరిపాడు గ్రామంలోని హెల్త్ వెల్‌నెస్ సెంటర్లో గురువారం ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌లో భాగంగా నుదురుపాడు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం, 104 ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. 76మంది రోగులకు బీపీ, షుగర్, థైరాయిడ్ వంటి పరీక్షలు చేశారు. నెలకు సరిపడా మందులు అందజేశారు. వైద్యురాలు శాంతి మాట్లాడుతూ తమ చుట్టూ ఉన్న పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవడం ద్వారా రోగాలు రాకుండా ఉండేందుకు ఉపయోగకరంగా ఉంటుందని చెప్పారు. వర్షాకాలం కావడంతో నీరు నిలిచి ఉన్న ప్రాంతాల్లో దోమలు లార్వా ఉండటంతో డెంగీ, మలేరియా వంటి వ్యాధులు వచ్చే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో ఎంఎల్ హెచ్‌పీ స్వప్న, ఏఎస్ఎం ఆంతోనిరాణి, డేటా ఎంట్రీ ఆపరేటర్ లక్ష్మి, ఎంహెచ్ఎ బాబురావు, ఆశాలు సుజాత, పద్మ, శాంతరాణి, శాంతకుమారి, జోజమ్మలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అదాలత్, అవగాహన సదస్సు

తాడేపల్లిరూరల్: కన్స్యూమర్ గ్రీవెన్సెస్ రెడ్రెస్సల్ ఫోరం (సీజీఆర్ఎఫ్) విజయవాడ ఆధ్వర్యంలో శుక్రవారం విద్యుత్ అదాలత్, అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు అమరావతి డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ టి.వి. తులసీరామ్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రం, మహానాడులో గల అసిస్టెంట్ ఇంజినీర్ వారి కార్యాలయ ప్రాంగణంలో విద్యుత్ అదాలత్, అవగాహన సదస్సు కార్యక్రమం ఉదయం 10.30 గంటల నుంచి నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీజీఆర్ఎఫ్ చైర్మన్ విక్టర్ ఇమ్మానుయేల్, ఫోరం సభ్యులు, సూపరింటెండింగ్ ఇంజినీర్, సీఆర్‌డీఏ అమరావతి విద్యుత్ అధికారులు పాల్గొంటారని, డివిజన్‌లోని విద్యుత్ వినియోగదారులు తమ ఫిర్యాదులను రాతపూర్వకంగా సర్వీస్ కనెక్షన్ నెంబర్, పూర్తి చిరునామా, సెల్ నెంబర్‌తో అర్జీ ఇచ్చి సమస్యలను పరిష్కరించుకోవాలని, విద్యుత్ అంతరాయాలు, హెచ్చుతగ్గులు, మీటరు సమస్యలు, బిల్లుల సమస్యలు, విద్యుత్ సరఫరాకు సంబంధించిన ఇతర అన్ని సమస్యలు పరిష్కరిస్తామని విద్యుత్ వినియోగదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ టి.వి.తులసిరామ్ కోరారు.

అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌కు వైద్య పరికాలు అందజేత



తాడేపల్లిరూరల్: తాడేపల్లి ప్రకాష్‌నగర్‌లో ఉన్న ప్రభుత్వ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌కు వైఎస్సార్ సీపీ తాడేపల్లి పట్టణ కన్వీనర్ బుర్రముక్కు వేణుగోపాల స్వామిరెడ్డి రూ.80 వేల విలువైన వైద్య పరికరాలను గురువారం అందజేశారు. డాక్టర్ మానస మంజరి మాట్లాడుతూ ఈనె 20, 21 తేదీలలో నేషనల్ క్వాలిటీ స్టాండర్డ్ సెంట్రల్ టీమ్ వారు అర్బన్ హెల్త్ సెంటర్‌ను సందర్శిస్తున్న నేపథ్యంలో హాస్పిటల్‌లో వైద్య పరికరాలు అవసరం ఉందని వైఎస్సార్ సీపీ తాడేపల్లి పట్టణ కన్వీనర్ బుర్రముక్కు వేణుగోపాలస్వామిరెడ్డికి తెలియజేయగా స్పందించిన ఆయన వాటిని ఉచితంగా అందజేశారని తెలిపారు. వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధానకార్యదర్శి ఈదులమూడి డేవిడ్‌రాజు, తాడేపల్లి మండల జేసీఎస్ కన్వీనర్ మున్నంగి వివేకానందరెడ్డి పాల్గొన్నారు.

నిబంధనలు పాటించని ప్రైవేటు బస్సులపై కేసు నమోదు

పట్నంబజారు: నిబంధనలకు విరుద్ధంగా ఆర్టీసీ బస్టాండ్ పరిసర ప్రాంతాల్లో కాంట్రాక్టు క్యారేజీ బస్సులు, మోటారు క్యాబ్‌లు నిలిపితే చర్యలు తీసుకుంటామని డీటీసీ షేక్ కరీం హెచ్చరించారు. ఇందులో భాగంగా ఈనెల 13న ఆర్టీసీ బస్టాండ్ పరిసర ప్రాంతాల్లో నిలిపిన ఐదు ప్రైవేటు బస్సులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

మనసున్న మారాజు జగనన్న

- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త సురేష్‌కుమార్
- పలుచోట్ల నూతన పింఛన్ల పంపిణీ



గుండాలపాడులో నూతన పింఛన్లు అందజేస్తున్న నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్, జెడ్పీటీసీ సభ్యురాలు డి.కత్తిరేణమ్మ

ఫిరంగిపురం: మనసున్న మారాజు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్ అన్నారు. మండలంలోని గుండాలపాడు గ్రామంలోని సచివాలయం వద్ద గురువారం రెండోసారి నూతన పింఛన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. సురేష్‌కుమార్ పాల్గొని నూతన పింఛన్లు పంపిణీచేశారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఇంత మంచిపాలన ఎక్కడాలేదని చెప్పారు. మధ్యవర్తులతో పనిలేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ ఫలాలు అందించిన ఘనత ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందని చెప్పారు. గత ప్రభుత్వాల పాలనలో సంక్షేమం కనుచూపుమేరలో లేదన్నారు. పేదవానికి సంక్షేమ ఫలం అందాలంటే దళారి వ్యవస్థ ద్వారా అందే పరిస్థితి ఉండేదన్నారు. ప్రస్తుత పాలనలో అటువంటిదేమీ లేదని చెప్పారు. అర్హతే ప్రామాణికంగా బడుగు, బలహీనవర్గాల వారికందరికి పథకాలు అందించినట్లు తెలిపారు. జగనన్న సురక్ష వంటి పథకాల ద్వారా విద్య, వైద్యం, వ్యవసాయం, పింఛన్లు పేదవారికి అందాయన్నారు. చంద్రబాబు తన 14 ఏళ్ల పాలనలో పేదలకు చేసిందేమీ లేదని చెప్పారు. అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటూ జైలులో ఉన్నారన్నారు. ప్రభుత్వం చేసిన మంచి పనులు ప్రజలు గుర్తుంచుకొని వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని గెలిపించి ముఖ్యమంత్రిగా మరోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని నిలపాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు దాసరి కత్తిరేణమ్మ, సర్పంచ్ కె.పెదబాబు, వసంతరావు, సైదా, బాజీ, కార్యదర్శి లక్ష్మీ శారద తదితరులు పాల్గొన్నారు.

- మండలంలోని మేరికపూడిలో సర్పంచ్ పూసపాటి నాగమల్లేశ్వరి నూతన పింఛన్లు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు పి.వెంకట్రామిరెడ్డి, ఉపసర్పంచ్ కె.పద్మావతి, డి.బ్రహ్మారెడ్డి, ఎంపీటీసీ సభ్యులు హనుమాయమ్మ తదితరులు పాల్గొన్నారు.
- గొల్లపాలెంలో సర్పంచ్ దాసరి మెల్కియా ఆధ్వర్యంలో గురువారం నూతనంగా మంజూరైన వారికి పింఛన్లు అందజేశారు. కార్యక్రమంలో సచివాలయం కార్యదర్శి కోటేశ్వరరావునాయక్, మండలనాయకులు పాల్గొన్నారు.
- బేతపూడి గ్రామంలో సర్పంచ్ ఆదంబీ ఆధ్వర్యంలో నూతన పింఛన్లు అందజేశారు, కార్యక్రమంలో మస్తాన్‌వలి, ఖాజావలి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పింఛన్లు

లాం(తాడికొండ): కుల, మతాలు, పార్టీలకతీతంగా అర్హతే ప్రామాణికంగా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పింఛన్లు అందించడమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం అన్ని విధాలా పనిచేస్తుందని డీసీఎంఎస్ డైరెక్టర్ దాసరి రాజు అన్నారు. తాడికొండ మండలం లాం గ్రామంలో నూతనంగా మంజూరైన పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. గతంలో పింఛన్లు సంక్షేమ పథకాలు పేదవాడికి దరిచేరాలంటే జన్మభూమి కమిటీలు, టీడీపీ నాయకుల సిఫార్సు ఉంటేనే అందేవని, కానీ నేడు దానికి భిన్నంగా రాష్ట్రంలో అర్హత ఉన్న ప్రతి పేదవాడి ఇంటికీ వాలంటీర్ల ద్వారా పింఛను అందుతుందంటే అది జగనన్న చిత్తశుద్ధి పాలనకు నిదర్శనమన్నారు. సచివాలయ కన్వీనర్ షేక్ నూర్జహాన్, వైఎస్సార్‌సీపీ నాయకులు షేక్ మీర్జావలి పాల్గొన్నారు.

జన్మభూమి కమిటీలు అవసరం లేదు

తాడేపల్లిరూరల్: జన్మభూమి కమిటీలతో అవసరం లేదు, నాయకుల సిఫార్సుతో పనిలేదు, అర్హత ఉంటే చాలు పింఛన్ ఇంటికి వచ్చి అందజేస్తున్నారని దుగ్గిరాల ఎంపీపీ దానబోయి సంతోషరూపవాణి, జెడ్పీటీసీ సభ్యురాలు దాసరి అరుణ అన్నారు. దుగ్గిరాల మండల కార్యాలయంలో గురువారం 18 గ్రామాలకు చెందిన వారికి నూతన పెన్షన్లు అందజేశారు. వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత విడతల వారీగా పెన్షన్లు పెంచుతూ అర్హులైన వారిని ప్రతి ఆరు నెలలకు ఒకసారి గుర్తించి వారికి పెన్షన్లు అందజేస్తున్నారని అన్నారు. దుగ్గిరాల మండలంలో 465 కొత్త పెన్షన్లు వచ్చాయని, వీటితో కలుపుకుని 9000 పైచిలుకు ఉన్నాయని తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి నేతృత్వంలో మంగళగిరి నియోజకవర్గం ఎంతో అభివృద్ధి చెందిందని అన్నారు. సంక్షేమాన్ని, అభివృద్ధిని తట్టుకోలేని ప్రతిపక్షాలు తన నోటికి వచ్చినట్లు మాట్లాడుతున్నారని అన్నారు. భవిష్యత్తులో ప్రజలందరు సుఖసంతోషాలతో ఉండాలంటే ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని, ఎమ్మెల్యేగా ఆర్కేను మనం గెలిపించుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. మార్కెట్ యార్డు చైర్మన్ షేక్ బాజీ, సర్పంచ్‌లు బాతావత్ ఖుషీబాయ్, కొరితూల పద్మావతి, ఉన్నం ఝాన్సీ, ఇత్తడి రమేష్‌బాబు, పాటిబండ్ల కృష్ణ ప్రసాద్, దాసరి సుందరమ్మ, కొండూరు సుధారాణి, పలుకూరు మేరమ్మ, షేక్ అజీజున్, బి. శ్రీనివాస రెడ్డి, గంపల గంగాధరరావు, తహసీల్దార్ మల్లేశ్వరి, ఎంపీడీఓ కుసుమ శ్రీదేవి పాల్గొన్నారు.

కొలనుకొండలో.....

కొలనుకొండలో నూతన పింఛన్లు అందజేశారు. అర్హులైన 40 మందికి ఈ పెన్షన్లు వైఎస్సార్ సీపీ కొలనుకొండ కన్వీనర్ నూతక్కి శ్రీనివాసరావు అందజేశారు. కార్యక్రమంలో సెక్రటరి ప్రసాద్, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పెనుమాకలో....

పెనుమాకలో నూతనంగా 21 మందికి పెన్షన్లు పెనుమాక పార్టీ కన్వీనర్ దామేష్‌రెడ్డి అందజేశారు. కార్యక్రమంలో సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ నరేష్, వైఎస్సార్ సీపీ నాయకులు బొక్కా ప్రసన్నకుమార్(నాని), షేక్ బషీర్, పులి భుజంగరావు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



దుగ్గిరాలలో పింఛన్ అందజేస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ



కొలనుకొండలో...



లాం గ్రామ పంచాయతీలో పింఛన్లు పంపిణీ చేస్తున్న డీసీఎంఎస్ డైరెక్టర్ దాసరి రాజు

నిబంధనలు తప్పనిసరి



మేడికొండూరు: వినాయకచవితి వేడుకల సందర్భంగా పందిళ్ల ఏర్పాటు విషయంలో ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించాలని మేడికొండూరు సీఐ కె.వాసు అన్నారు. గురువారం పోలీస్‌స్టేషన్ పరిధిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చవితి పందిళ్లకు ప్రతి ఒక్కరూ ముందస్తు అనుమతులు తీసుకోవాలని అన్నారు. ముఖ్యంగా గ్రామాలలో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా మైకులు పరిమితికి మించి పెట్టరాదన్నారు. ప్రతి విగ్రహం వద్ద ఐదుగురు కమిటీగా ఏర్పాడి వారి వివరాలను పోలీస్‌స్టేషన్‌లో తెలియజేయాలన్నారు. అనుమతులు లేకుండా విగ్రహాలను ఏర్పాటు చేసిన వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. రాత్రి సమయాలలో మైకులను ఉపయోగించరాదన్నారు. నిమజ్జన సమయంలో కమిటీ సభ్యులు బాధ్యతగా వ్యవహరించి ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చూసుకోవాలని సూచించారు. ఎటువంటి అల్లర్లు సృష్టించిన క్రిమినల్ కేసులు నమోదు చేసేందుకు వెనుకాడే ప్రసక్తే లేదని ఆయన హెచ్చరించారు.

కేఎల్‌యూలో ఎన్‌సీసీ ఎంపికలు



తాడేపల్లిరూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరంలో ఉన్న కేఎల్ విశ్వవిద్యాలయంలో ఎన్‌సీసీ 22వ ఆంధ్రా బెటాలియన్ తెనాలి రీజియన్‌లో గురువారం ఎంపికలు జరిగినట్లు యూనివర్సిటీ ఎన్‌సీసీ 22వ బెటాలియన్ లెఫ్టినెంట్ ఆచార్యులు వి.మౌనిక తెలిపారు. ఈ కార్యక్రమానికి ఏపీఎస్పీ 6వ బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ హనుమంతు ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు అవగాహన కల్పించారు. సెలక్షన్ కమిటీ సభ్యులు సుబేదార్ జ్యోతిసింగ్, హవల్దార్ కుష్బీర్‌సింగ్‌లు పాల్గొని విద్యార్థులను ఎంపిక చేశారు. వి.మౌనిక మాట్లాడుతూ సుమారు 460 మంది విద్యార్థులు హాజరవగా 80 మందిని ఎంపిక చేసినట్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు సుమారు 3 సంవత్సరాలపాటు ప్రత్యేక సైనిక శిక్షణ ఇచ్చి వారికి బి,సి సర్టిఫికెట్లు అందజేస్తారన్నారు. ఎంపికైన విద్యార్థులను విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథివర్మ, ప్రొ వైస్ చాన్సలర్ డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎన్.వెంకట్‌రామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, విద్యార్థి సంక్షేమ విభాగాధిపతి డాక్టర్ చప్పిడి హనుమంతరావు, హాబీ క్లబ్ ఇన్‌చార్జి ప్రొఫెసర్ ఆర్.సుభాకర్‌రాజులు అభినందించారు. సమన్వయకర్త జి.చంద్రశేఖర్ పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రజల అభ్యున్నతికి నవరత్నాల పథకాలు దోహదం

- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త సురేష్‌కుమార్
- మందపాడులో గడప గడపకు మన ప్రభుత్వం



ప్రభుత్వ సంక్షేమ పథకాల కరపత్రాన్ని అందజేస్తున్న కత్తెర సురేష్‌కుమార్

మేడికొండూరు: ప్రజలకు అన్ని రకాల ప్రభుత్వ సేవలు సచివాలయాల ద్వారా అందుబాటులోకి తీసుకు వచ్చి నేరుగా ఇబ్బందిపడకుండా అవసరాలు తీరుస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని వైఎస్సార్ సీపీ తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్ అన్నారు. ప్రజా సమస్యలు తెలుసుకుంటూ, ప్రభుత్వం అందించే పలు రకాల సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికి అందుతున్న తీరు తెలుసుకునేందుకు ప్రభుత్వం ప్రతిష్ఠాత్మంగా ప్రవేశపెట్టిన గడప గడపకు మనప్రభుత్వం కార్యక్రమం మంగళవారం మందపాడు గ్రామపరిధిలో జరిగింది. సురేష్‌కుమార్ ఇంటింటికి తిరిగి మహిళలతో మాట్లాడి స్థానికంగా ఉన్న సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అర్హత ఉన్న ప్రతిఒక్కరూ ప్రభుత్వ పథకాలు పొందాలని తెలిపారు. అమ్మ ఒడి, చేయూత, ఆసరా పథకాలు సక్రమంగా అందుతున్నాయా అంటూ మహిళలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో సమస్యలు పరిష్క రించేందుకు కృషిచేస్తామని అన్నారు. గ్రామంలో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. గడిచిన నాలుగు సంవత్సరాల కాలంలో రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేసిందని అన్నారు. విద్యా, వైద్య రంగాలను ప్రక్షాళన చేసి సమూలమైన మార్పులు చేపట్టడం జరిగిందని అన్నారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాలకు పూలమాలలు వేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచి ఆవుల సంజీవరెడ్డి, మండల కన్వీనర్ తాళ్లూరి వంశీకృష్ణ, దొడ్డా సాంబిరెడ్డి, వైస్ ఎంపీపీ భవనం రాజశేఖరరెడ్డి, అబ్బాస్ వజ్రాల బ్రహ్మారెడ్డి తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్యాకేజీ కుదిరినందునే అపవిత్ర కలయిక

తాడికొండ: రాజమండ్రి సెంట్రల్ జైల్ సాక్షిగా ప్యాకేజీ కుదిరినందునే పవన్ కల్యాణ్, చంద్రబాబుల అపవిత్ర కలయిక బయటకు వచ్చిందని వైఎస్సార్‌సీపీ తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్ అన్నారు. చంద్రబాబును జైల్లో కలిసిన అనంతరం పవన్ కల్యాణ్ పొత్తుల ప్రకటన చేయడంపై స్పందించిన కత్తెర సురేష్ కుమార్ తనదైన శైలిలో విమర్శించారు. రాష్ట్రంలో తమను ప్రజలెవరూ నమ్మడం లేదని గ్రహించిన వీరిద్దరూ ముసుగులు తొలగించి అపవిత్ర కలయికకు శ్రీకారం చుట్టడం సిగ్గుచేటన్నారు. ఓ వైపు అవినీతి కేసులో శిక్ష పొందుతున్న ఖైదీగా ఉన్న చంద్రబాబును రాష్ట్రం యావత్తు విమర్శిస్తుంటే పవన్ పరామర్శ పేరుతో వెళ్లి పొత్తుల ప్రకటనలు చేయడం వారి చేతగాని తనానికి నిదర్శనమన్నారు. అధికారం కోసం బాబు ఎంతకైనా దిగజారుతాడనడంలో ఇంతకన్నా నిదర్శనం ఏముందని, ఓ వైపు 27 కేసుల్లో స్టేలు తెచ్చుకొని, మరోవైపు జైల్లో ఖైదీగా ఉండి అధికారం కోసం పాకులాడటం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడం కాదా అని ప్రశ్నించారు. బాబు నిజంగా తప్పు చేయకుండా ఉంటే కోర్టుల్లో స్టేలు ఉన్న అన్ని కేసుల్లోను విచారణ ఎదుర్కొని తన సచ్ఛీలతను నిరూపించుకోవాలని అన్నారు. చేయని తప్పుకు జైల్లో పెట్టినా చిరునవ్వుతో ఎదుర్కొన్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విచారణను ఎదుర్కొని నిర్దోషిగా నిరూపించుకున్నాడని, బాబు మాత్రం ఎల్లో మీడియా, ప్యాకేజీ స్టార్‌లు, ప్యాకేజీ పార్టీలను అడ్డుపెట్టుకొని తప్పును ఒప్పుగా చేసుకునేందుకు యత్నించడం సిగ్గుచేటన్నారు. రాజకీయ వ్యభిచారిగా మారిన పవన్ కళ్యాణ్ పార్టీ పెట్టి అటు రాష్ట్ర ప్రజలను, ఇటు తన సామాజిక వర్గాన్ని పూర్తిగా మోసం చేస్తూ చంద్రబాబుకు దత్తపుత్రుడుగా మారి బాబును సీట్లో కూర్చోబెట్టేందుకు పడుతున్న తంటాలు చూసి ప్రజలు నవ్వుకుంటున్నారన్నారు.

మృతుడి కుటుంబానికి ఎమ్మెల్యే ఆర్థిక సాయం

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండలం ఈమని గ్రామానికి చెందిన పెనుమాక ఇమ్మానియేల్ అనారోగ్యంతో మృతిచెందగా అంత్యక్రియల నిమిత్తం ఆ కుటుంబానికి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) రూ.10 వేలు ఆర్థిక సాయం అందించారు. ఆ మొత్తాన్ని ఈమని సొసైటీ అధ్యక్షుడు నలకుర్తి ఏసుపాదం గురువారం అందజేశారు. ఇమ్మానుయేల్ కుటుంబ సభ్యులను పరామర్శించిన వారిలో వైఎస్సార్ సీపీ నాయకులు మత్తే ఆనంద్, రాచకొండ శంకర్, ఉయ్యూరు మారుతి, చొక్కా కాంతారావు, తులాంబంధుల శ్రీను, కత్తిక శ్రీనివాసరావు, నీలి భోగేశ్వరరావు, వల్లభాపురం సీత, వాక శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. మండల పరిధిలోని శృంగారపురం గ్రామానికి చెందిన కనపాల వినోద్ అనారోగ్యంతో బాధపడుతూ గురువారం మృతి చెందిన విషయాన్ని స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు శృంగారపాటి రత్నం ఎమ్మెల్యే ఆర్కేకు తెలియజేయగా స్పందించిన ఆయన రూ.10 వేలు ఆర్థిక సహాయాన్ని ప్రకటించి అందజేశారు. కార్యక్రమంలో ఉప్పాల సుబ్బారావు, దాసరి వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక నేరగాడికి వత్తాసు సిగ్గుచేటు

ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే)



కాజలో అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే)

మంగళగిరి : ఆర్థిక నేరగాడికి అజ్ఞాన వాసికి వత్తాసు పలకడం సిగ్గుచేటని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) అన్నారు. నగరంలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను ఎమ్మెల్యే ఆర్కే గురువారం పరిశీలించారు. పనులు సత్వరమే పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావుతో కలిసి విలేకరులతో మాట్లాడుతూ రాజకీయపార్టీలతో పొత్తుల గురించి మాట్లాడాల్సిన అవసరం లేదని జనసేన నాయకుడు పవన్ కల్యాణ్, చంద్రబాబు ఎప్పుడూ పొత్తులోనే ఉన్నారన్నారు. ప్రజలకు ప్రజాపాలన అందింది సంక్షేమ పథకాలు అమలు పరుస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల మన్ననలు పొంది మరలా ఎన్నికలలో వైఎస్సార్ సీపీ విజయం సాధింస్తుందనే అక్కసుతో పవన్ కల్యాణ్ చంద్రబాబుకు మద్దతు ఇచ్చి డ్రామాలాడుతున్నారని విమర్శించారు. ఎవరెన్ని కుయుక్తులు చేసినా వచ్చే ఎన్నికలలో వైఎస్సార్ సీపీ విజయం సాధించడడం, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావడం తథ్యమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు మాజీ వైస్ చైర్మన్ అన్నపురెడ్డి బ్రహ్మారెడ్డి, డీఈ కృష్ణారెడ్డి, ఏఈ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో విశేషార్చనలు

పాత గుంటూరు: శ్రావణ మాసం సందర్భంగా అరండల్ పేటలోని శ్రీ అష్టలక్ష్మీ సమేత శ్రీ లక్ష్మీనారాయణస్వామి దేవస్థానంలో ప్రధాన అర్చకులు మర్రిపాటి ప్రసాద్ ఆధ్వర్యంలో 1800 మంది ముత్తైదువులు కోటి నాలుగు లక్షల నామ పారాయణతో అమ్మవారిని సేవించారు. గోపూజ, శ్రీ చక్ర మహామేరుకు విశేషాభిషేకం అనంతరం విఘ్నేశ్వర పూజతో కార్యక్రమాలు ప్రారంభించారు. అమ్మవారికి రెండు లక్షల గాజులతో అభిషేకార్చన నిర్వహించారు. శాంతి హోమం, మహా పూర్ణాహుతి కార్యక్రమాల్ని వేద పండితులు అత్యంత భక్తిశ్రద్ధలతో జరిపారు. పెద్దసంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలతో పాటు అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

డీసీపీ బాధ్యతల స్వీకారం

నెహ్రూనగర్: గుంటూరు నగరపాలక సంస్థ డీసీపీ - 1గా సంపూర్ణ మహాపాత్ర గురువారం బాధ్యతలు స్వీకరించారు. గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్‌లో అసిస్టెంట్ సిటీప్లానర్‌గా విధులు నిర్వహిస్తున్న ఆయనకు డీసీపీగా (డెప్యూటీ సిటీప్లానర్) పదోన్నతిపై గుంటూరుకు బదిలీ కావడంతో గురువారం నగర కమిషనర్ కీర్తి చేకూరిని మర్యాదపూర్వకంగా కలిశారు.

గాంధీ పార్క్ త్వరలో ప్రారంభం

కమిషనర్ కీర్తి చేకూరి



గాంధీ పార్కులో పర్యటిస్తున్న కమిషనర్ కీర్తి చేకూరి

నెహ్రూనగర్: గాంధీ పార్క్‌ను త్వరలో ప్రారంభించి, ప్రజలకు అందుబాటులోకి తీసుకురానున్నామని నగర కమిషనర్ కీర్తి చేకూరి వెల్లడించారు. ఆమె గురువారం పార్క్‌ని పరిశీలించారు. త్వరలో ప్రారంభించడానికి చర్యలు తీసుకోవాలని ఇంజినీరింగ్ అధికారుల్ని ఆదేశించారు. కమిషనర్ మాట్లాడుతూ నగరంలో ప్రధానమైన గాంధీ పార్క్ అభివృద్ధి పనులు పూర్తయ్యాయని తెలిపారు. ప్రధాన గేటులోని ఫౌంటెన్, గులాబీ తోట, సెల్ఫీ పాయింట్స్, క్లాక్ టవర్, చెస్ బోర్డ్, జంగిల్ బుక్, ఓపెన్ జిమ్, పిల్లల ఆట వస్తువులు, వాకింగ్ ట్రాక్‌లను పరిశీలించారు. కొన్నిచోట్ల మొక్కలు ఎండి పోయాయని, వాటి స్థానంలో కొత్తవి పెంచాలని ఏడీహెచ్‌కి చెప్పారు. సివిల్ పనుల్ని శుక్రవారం నాటికి పూర్తి చేయాలని ఎస్ఈని ఆదేశించారు. పార్క్‌లో లైటింగ్‌ని పరిశీలించారు. నిర్దేశిత ప్లాన్ మేరకు ఏర్పాటు చేసిన ప్రతి లైట్ వెలగాలని, మరొకసారి తనిఖీ చేయాలని ఈఈకి సూచించారు. వాహనాలు పార్క్ చేసిన వారు నేరుగా లోపలకు రాకుండా, మెయిన్ గేటు ద్వారానే వచ్చేలా చూడాలని తెలిపారు. టాయ్‌లెట్స్ పార్క్‌లో ఉండేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు.

భాష మీద పట్టు అవసరం



సాహితీవేత్త రాజేంద్రప్రసాద్‌ను సత్కరిస్తున్న పీఎం ప్రసాద్

గుంటూరు ఎడ్యుకేషన్: భాష మీద పట్టుతోనే జీవితంలో అనుకున్నది సాధించేందుకు అవకాశాలు ఉంటాయని సాహితీవేత్త తూములూరి రాజేంద్రప్రసాద్ తెలిపారు. మార్కెట్ సెంటర్లోని హిందూ కళాశాల హిందీ విభాగ ఆధ్వర్యంలో గురువారం హిందీ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా హిందీ విభాగాధిపతి డాక్టర్ గుడిపూడి విజయ రత్నకుమార్ అధ్యక్షతన జరిగిన సభలో రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ప్రపంచంలో ఎక్కువ మంది మాట్లాడే భాషల్లో హిందీ రెండో స్థానంలో ఉందని తెలిపారు. భాషను నేర్చుకునే విషయంలో అలసత్వం పనికిరాదని, శ్రమించి క్రమ పద్ధతిలో నేర్చుకున్నప్పుడే పట్టు సాధించవచ్చని సూచించారు. బాషను సంపూర్ణంగా నేర్చుకున్న వారే జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగగలరని తెలిపారు. సభలో కళాశాల ప్రిన్సిపాల్ పి.ఎం. ప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ కె.వి.ఎస్. దుర్గా ప్రసాద్, విద్యావిషయక సమన్వయకర్త డాక్టర్ కె.కాళిదాస్, ఆంగ్ల విభాగాధిపతి డాక్టర్ అందె బాల శౌరి, తెలుగు విభాగాధిపతి డాక్టర్ యల్లాప్రగడ మల్లికార్జునరావు, హిందీ అధ్యాపకులు షేక్ బాజీ, చిలకా అరుణ, ఈ. సుదర్శన్ ప్రసంగించారు. ఈ సందర్భంగా హిందీలో అధిక మార్కులు సాధించిన విద్యార్థిని, విద్యార్థులకు బహుమతులు అందజేశారు.